
# మేరా పితాజీ మహాన్...




**సచివాలయం ప్రత్యేక బస్సు మలక్ పేట్లో బయలుదేరి రెండు నిముషాలైన కాలేదు, ప్రధాన మంత్రి పదవి పై పత్రికల్లో వచ్చిన వార్తలు గురించి చర్చ మొదలైంది.** బస్సులో అందరూ రాష్ట్రప్రభుత్వ ఉద్యోగస్తులే అందులోని సచివాలయం ఉద్యోగస్తులే కావటం వలన పట్టణ రాజకీయాల నుండి ప్రపంచ రాజకీయాల వరకు చర్చి జరుగుతూనే వుంటుంది. సీట్లో కూర్చున్నవారు కొందరు వారపత్రికలు, దినపత్రికలు చదవటంలో మునిగిపోయారు. దినపత్రికలు కొనే అలవాటు లేని వారు పక్కవారి చదువుతున్న పేపరు లాక్కొని చదవటం, చదవటమే కాకుండా ఆ పేపర్లో విషయాలు పెద్దగా అరుస్తూ, అందరికీ విపులీకరిస్తూ తానే రాజకీయ నాయకుడిలా పోజు కొట్టేవారు మరికొందరుంటారు. ఆ కోవకి చెందినవాడే వీర్రాజు. అతను జీఏడిలో హెడ్ గుమాస్తా. వేజ్ రివిజన్, పే-రివిజన్, టిఏ, డిఏ, ఎల్టీసి వంటి లెక్కాపత్రాలు నయాపైసలతో సహా నోటికే లెక్కగట్టి చెప్పగల సత్తావున్నవాడు. అలాగే ఎన్నికల రాజకీయ అంచనాలను కూడా చెప్పగలడు. పైగా కాంగ్రెస్‌వాది. ఈ సారి ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు, కాంగ్రెస్ మిత్ర పక్షాలకి ఎన్ని ఓట్లు వస్తాయి, ఎన్ని సీట్లొస్తాయి. తె.రా.స, టిడిపికి ఎన్నెన్ని అంచనా వేసి చెప్పినట్లుగా చెప్పాడు. వీర్రాజు చెప్పినట్లుగానే కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్‌కే మెజారిటీ వచ్చింది. ముఖ్యమంత్రి విషయమై రాష్ట్ర సమస్య ఒక్కరోజులో తీరిపోయింది. కాని కేంద్రంలో ఎవరు ప్రధాని అనేది ఆనాటి చర్చ. కాంగ్రెస్ అధ్యక్షురాలైన సోనియా గాంధియే ప్రధానిమంత్రి కాగలరని వీర్రాజు ఉవాచ. కాని అతని అంచనాలు తలక్రిందులు చేస్తూ 'అంతరాత్మ ప్రబోధం' 'త్యాగమయి సోనియ' 'ఆమెకాదు అతడే ప్రధాని' 'మనీమోహన్ సింగ్' 'మనమోహన్ సింగ్' ప్రధాని అని అన్ని పేపర్లో హెడ్‌లైన్స్‌తో వచ్చాయి. అది చదివిన వీర్రాజు తోకతొక్కిన పాములా బస్సు ఎక్కగానే బుస్సుమని అందరిమీద విరుచుకు పడ్డాడు.

"అసలు సోనియాకి ఏం తక్కువయిందని? ఆమె విదేశీ ఎట్లవుద్ది? 1980లోనే ఇటలీ పౌరసత్వాన్ని రద్దు చేసుకుంది. ఈ బిజెపి వోళ్ళు గింతే! అప్పుడు ఆమెని పార్లమెంటు అపోజిషన్ లీడరుగా ఎట్లొప్పుకున్నారు. అప్పుడు విదేశీ కాదా? విదేశీయులు వచ్చి భారత దేశానికి సేవచేసి ఇక్కడ జనంలో కలసిపోవటం శతాబ్దాలుగా జరుగుతూనే వుంది. కుషాణులు, మెసిడోనియన్లు, మొగలులు మనదేశంలో కల్సిపోలేదా! అసలు స్వాతంత్ర్య పోరాటంలో అగ్రభాగాన నిలిచిన కాంగ్రెస్ పార్టీని స్థాపించింది ఆంగ్లేయుడైన ఎ.ఓ.హ్యూమ్ అని మీకు తెల్సా?" అంటూ చరిత్ర పేజీలు తిరగేశాడు వీర్రాజు.

అతని వాగ్ధాటికి అందరూ మంత్ర ముగ్ధులై వింటున్నారు. రెచ్చిపోతున్నాడు వీర్రాజు. "మహాత్మాగాంధి వెంట నడిచి హోంరూల్ ఉద్యమంలో ప్రధాన పాత్ర వహించింది అనీబిసెంట్, ఐరిష్ వనిత. గాంధీ వెంటవున్న శిష్యురాళ్ళు విదేశీయులే. మీర్జా బెహన్ బ్రిటిష్ సైనికాధికారి కుమార్తె. సి.ఎఫ్.అండ్ర్యూస్ కూడా విదేశీయే! చరిత్ర పొడుగునా విదేశీ జాతులు భారతజాతిలో మమేకం అయ్యాయి. ప్రజలు ఆదరించారు. సమాజం కూడా అక్కున చేర్చుకుంది. ఈ. లోకమంతా 'వసుధైక కుటుంబం' అన్నది మన భారతీయ తత్వచింతన. అలాంటిది రాజకీయ నాయకులు రాజకీయాల కారణంగా 'ఆమె'కి విదేశీ ముద్ర వేశారు." ఆవేశంగా కొనసాగుతోంది వీర్రాజు స్పీచ్.

"ఆమె అంతరాత్మ ప్రబోధం నమ్మశక్యంగా లేదు. ఎందుకంటే అంతకు ముందు మూడు రోజులుగా ఆమెని ప్రధాని చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను సోనియాజి నిరోధించలేదు. అంటే అంతరాత్మ హఠాత్తుగా మేల్కొందా?" చిన్నగా గొణిగాడు మరో ఉద్యోగి. అది విన్న వీర్రాజు జవాబు చెప్పలేక మొఖం తిప్పేశాడు. "అసలు రాజకీయాల్లో చేరను అని 1996లో రావటం, పదవి వద్దంటూనే సీతారాం కేసరిని తోసేసి ఆ పదవి చేపట్టడం. ఆడవారి మాటలకు అర్థాలు వేరులే.." చిన్నగా హమ్ చేశాడు పేపర్ చూస్తున్న యువ ఉద్యోగి. సెంట్రల్ మినిస్ట్రీలో ఆంధ్ర ప్రాంతానికి ఎంతమంది? టి.ఆర్.

ఎస్.కి ఎన్ని, స్టేట్ క్యాబినెట్‌లో ఎంత మంది. హోంశాఖ ఎవరికిస్తారు? ఇలా బస్సులో ఎవరికి తోచినట్లుగా వారు మాట్లాడుతున్నారు. ప్రపంచంలో శబ్దకాలుష్యం అంతా బస్సులోనే వుందనిపిస్తుంది.

ముందు వరుసలో కూర్చున్న లేడీస్‌లో కూడా డిస్కషన్ మొదలైంది.

“సోనియా పెళ్ళైన తర్వాత ఇందిరాగాంధి దగ్గరే ఉండిపోయిందట. ఇందిరాగాంధి అంగరక్షకుల తుపాకి గుళ్ళకి నేలకొరిగిపోతే మొదటిసారిగా సోనియానే చూసి తన ఒళ్ళో పడుకోబెట్టుకొందట” సానుభూతిగా చెబుతోంది ఇద్దరు కోడళ్ళున్న సుబ్బలక్ష్మి. ఆమె పంచాయితి డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ ఆఫీసర్. “రాజకీయాల్లో కూడా మహిళలకి ముప్ఫైశాతం రిజర్వేషన్ ఇస్తే మన సోనియా తప్పక ప్రధాని అయ్యేది” ఆశగా చెప్పింది మరో యువతి.

అంతలో కీ...కీ... సెల్ చప్పుడు. “హల్లో... గోపాల్ రెడ్డి... ఏంది ఇంకా పార్లమెంటులో చర్చ కొనసాగుతోందా? నువ్ ఢిల్లీ నుండే మాట్లాడుతున్నావా?.. ఓ.కె.. వుంటా, ఫైనల్ అయినాక మల్లా ఫోన్ చెయ్” తన గొప్పతనాన్ని చాటి చెప్పుతున్నట్లుగా పలికాడు మరో ఉద్యోగి. నిజానికి తన మిత్రుడు ఢిల్లీలో వున్నాడో, గల్లీలో వున్నాడో ఎవరికి తెలుసు. ఉన్నట్లుండి బస్సు సడన్‌గా బ్రేక్ కొట్టి ఆపాడు డ్రైవర్ యాదగిరి. అందరూ ఆత్రుతగా బయటికి చూశారు. అది నాంపల్లి చౌరస్తా. “ఏంది యాదగిరి ఎందుకాపినావ్” ఎవరో ముందుకి పోయి ప్రశ్నించారు. “మా టి.ఆర్.ఎస్.కి మంత్రివర్గంలో ప్రాముఖ్యత వుందా? మా చంద్రశేఖర్‌కి సార్ ఏమిస్తరు. ముందుగల్ల సెటిల్ చెయ్యుండ్రి.” మొండిగా అన్నాడు డ్రైవర్.

“అరె! అన్నా... మన సార్‌కి రోడ్డు రవాణా ఇస్తారే... లేకుంటే ఓడ రవాణా అడుగుదాం.. వూకుంటామా?.. గడ్‌బిడ్ చేస్తాం. తెలంగాణా బంద్, భారత్ బంద్” అని సముదాయించాడు మరో ఉద్యోగి.

“అరె... ముందు బస్ పోనియ్. ఈ రోజు కొత్త ముఖ్యమంత్రిగారికి సన్మానం చెయ్యాలి. లేటైతే బాగుండదు. పోనీ... కండక్టర్” ఆర్డర్ వేశాడు చిన్న తరహా ఎంప్లాయీస్ యూనియన్ లీడర్ స్వామి.

అందరి రణగొణులు మధ్య బస్ మళ్ళీ స్టార్ట్ అయి ఎట్టకేలకు సచివాలయం చేరింది.

❋ ❋ ❋

పొద్దు పోయాక ఇంటికొచ్చిన వీర్రాజుకి ఏమి తోచటం లేదు. తన ప్రియతమ నాయకురాలు ప్రధాని కాలేకపోతున్నందుకు బాధగా ఉంది. టి.వి చూస్తున్నాడు. ఇంకా పార్లమెంట్‌లో చర్చ ప్రత్యక్ష ప్రసారం కొనసాగుతోంది.

“ఏవండీ... తెల్లవారింది మొదలు పొద్దుపోయేవరకు ఆ దిక్కుమాలిన రాజకీయాలేనా... మన అమ్మాయి సంబంధం గురించి ఏమైనా ఆలోచించారా? పొద్దున గుంటూరు వాళ్ళు ఫోన్ చేశారు. మనమ్మాయిని ఖాయం చేసుకుంటారట” కాఫీ గ్లాసు అందిస్తూ చెప్పింది భార్య సక్కుబాయి.

‘శుభం అమ్మాయి ఏమంది?’

“దాని అంతరాత్మ ఒప్పుకోవటం లేదట. సుముఖంగా లేదు.”

“సుముఖంగా లేకపోవటానికి ఇదేమైనా ప్రధానమంత్రి పదవా?” గుర్రుమన్నాడు వీర్రాజు సుర్రుమని కాఫీ చప్పరిస్తూ.

“ప్రధాని మంత్రి పదవికంటే భర్త పదవి చాలా ప్రధానమైనదండీ. మంత్రి పదవి ఐదేళ్ళకి పీకేయవచ్చు. కానీ భర్త పదవి పది కాలాలు అంటే, జీవితాంతం ఉండవలసిందే” రాజకీయం లాజిక్ జోడించింది సతీమణి.

“ఇంతకీ దాని అంతరాత్మలో ఏముంది?”

“తన కొలీగ్ కన్నడ అబ్బాయికి మన సిచ్చిందట”

“కన్నడ అబ్బాయా! కెనడా అబ్బాయా!! సరిగ్గా చెప్పు” టి.వి ట్యూన్ తగ్గించి పలికాడు.

“ఏం కెనడా అయితే ఒప్పుకుంటారా?”

“నేనేం ఒప్పుకోను. ఇది మన కుటుంబ విషయం నా పరువు ప్రతిష్ఠ, వంశ గౌరవానికి సంబంధించినది. అయినా తల్లిగా వెనకేసుకొస్తున్నందుకు నిన్ననాలి. ఆరునూరైనా ఆ గుంటూరు సంబంధమే చేస్తాను” బీపీ పెంచుకుంటూ సినిమా డైలాగులా వార్నింగ్ ఇచ్చాడు వీర్రాజు.

“అసలు మీ మగాళ్ళననాలి. రాజకీయం మాట్లాడినప్పుడు మనమంతా భారతీయులం అంటారు. అల్లుడు విషయానికొచ్చేటప్పటికి కుల విభజన, రాష్ట్ర విభజన చేస్తారు. కులం పేరు చెప్పి కట్నానికి ఆశపడి కట్టుకున్నవాడి కంటే మనసావాచా అమ్మాయిని ప్రేమించే వాడితో పెళ్ళిచేస్తే కనీసం ప్రేమికుల ఆత్మహత్యల్ని అడ్డుకునే తల్లిదండ్రులమవుతాము. ఆలోచించుకోండి” అల్టిమేటం జారీ చేసి ఖాళీ గ్లాసు అందుకుంది.

టి.విలో చర్చ లైవ్ హాట్‌గానే వస్తోంది. ఆలోచనలో పడ్డాడు వీర్రాజు.

“నిజమే సక్కూ... రాజకీయాల్లో రాజీ పడ్డ మనం నిజ జీవితంలో రాజీ పడటంలో తప్పులేదు. అమ్మాయి పెళ్ళి తనకి నచ్చినవాడితోనే చేస్తాను. వాళ్ళ పేరెంట్స్ కాంటాక్ట్ నెంబరు తీసుకో మాట్లాడతాను” టి.వి ఆఫ్ చేసి బయటకు నడిచాడు వీర్రాజు.

పక్కగదిలో నుండి సీన్ చూస్తున్న వీర్రాజు కూతురు శైలజ “థాంక్యూ సోనియా ఆంటీ...మేరా పితాజీ మహాన్” మనసులోనే ముసిముసిగా నవ్వుకుంది. ❋

